# విజ్ఞాన వాహిని

## కళ్ళజోడులు ఎందుకు?

ప్రతి ప్రాణికీ కళ్ళు వుంటాయి. కళ్ళ ద్వారా చుట్టూ వున్న ప్రపంచాన్ని చూడగలుగుతున్నది. కన్ను జ్ఞానేంద్రియాలన్నింటిలోకి ముఖ్యమైనది. మనం నేర్చుకునే విజ్ఞానంలో ఎక్కువ భాగం కన్ను ద్వారానే కలుగుతోంది.

ప్రతి వస్తువుని కన్ను ద్వారా చూడగలుగుతున్నాం. అవి దగ్గర వస్తువులు కానీయండి, దూరపు వస్తువులు కానీయండి. ఇలా దగ్గర వస్తువులను, దూరపు వస్తువులను స్పష్టంగా చూడడానికి కన్నులో 'ఆటోమాటిక్ మెకానిజం' సహజంగానే వుంది.

వయస్సు వలన ఐతేనేమి, అనారోగ్యం వల్లనైతేనేమి, లేక ప్రమాదాల వల్లనేమి కన్ను తన సహజత్వ శక్తిని కోల్పోతుంది. అప్పుడు చూపు తగ్గిపోతుంది. దీనివలన వస్తువులు, చదివే అక్షరాలు స్పష్టంగా కనిపించవు.

ఇలాంటప్పుడు గాజుతో తయారు చేసిన కళ్ళఅద్దాల ద్వారా కంటికి కలిగిన దోషాలను కొంతవరకు సరిచేయవచ్చు.

కంటి చూపులో నాలుగు విధాల దోషాలు మనకు కనిపిస్తాయి.

1) వృద్ధాప్యం వల్ల కలిగే చత్వారం
2) హ్రస్వదృష్టి 3) దూరదృష్టి 4) ఎస్టిగ్మాటిజం.

సాధారణంగా నలభై సంవత్సరాల వయస్సు పైబడిన వారికి వస్తువులు స్పష్టంగా కనిపించవు. అంతే కాకుండా చిన్న అక్షరాలు చదవలేరు. దీనిని చత్వారం అంటారు. కంటి గ్రుడ్డులోని లెన్స్ బలహీనపడడమే దీనికి కారణం. ఈ లోపాన్ని సరైన కళ్ళ అద్దాలు ఉపయోగించి సరిచేయవచ్చును.

కొంతమందికి దగ్గరగా వుంటేనే కాని వస్తువులు కనిపించవు. ఇలాంటివారు చదివేటప్పుడు పత్రికలని, పుస్తకాలని తమ ముఖం దగ్గరగా వుంచుకుంటారు. దీనిని హ్రస్వదృష్టి అంటారు. ఈ లోపాన్ని పుటాకార కటకాలు ఉపయోగించి సరిచేయవచ్చు.

కొంతమందికి దూరపు వస్తువులు స్పష్టంగా కనిపించవు. ఇలాంటి వారికి కుంభకార కటకాలు ఉపయోగించి దృష్టిలోపాన్ని సరిచేయవచ్చు.




వస్తువులోని నిలువు, అడ్డం స్పష్టంగా కనిపించవు. ఉదాహరణకి గడియారంలోని 12-30 గంటలు కనిపించకపోయినా 9-15 మాత్రం కనిపిస్తుంది. దీనినే ఎస్టిగ్మాటిజం అంటారు. ఇది కంటి రెటినాకు కలిగే లోపం. ఈ లోపాన్ని సరైన లెన్సెస్ ఉపయోగించి బహు జాగ్రత్తగా సరిచేయాలి.

పది అంగుళాల దూరంలో స్పష్టంగా చూడగలగడమే మంచి కన్ను లక్షణం. లేకపోతే కళ్ళజోడులు అవసరం అవవచ్చు.

**జి. నియంత**

## కాలమ్ దాటని కథ

మద్రాసు పానగల్ పార్కు గోడ పక్కన ఒక పెద్ద చెట్టుంది. ఆ చెట్టు కింద జనం మూగారు. మనసాగక నేనూ దూరాను. మద్రాసులో అలా ప్రతిదానికీ మూగడం, పర్సులు కృష్ణార్పణం కావడం రివాజు. ఇంతా చేస్తే ఒక చిలకలాంటి ఇరవైయ్యేళ్ల పిల్ల చిలక జోస్యం చెప్పించుకుంటోంది. ఆ జోస్యం చెప్పేవాడు ఆమెను కూచోబెట్టి మిగతా కుర్రకారుకు చెప్పేస్తున్నాడు. ఆమె లేచి వెళ్లబోయింది. "నీకు మంచి టైంలో చూడాలి తల్లీ! కాదలించి (తమిళంలో కాదక అంటే ప్రేమ) కళ్యాణం చేసుకోవాలి" అని జోక్ చేశాడు: ఆమె కోసం అక్కర్లేనివాళ్ళు, బస్సులుకోసం వెయిట్‌చేసే వాళ్లు అక్కడ గుమిగూడారు. వాళ్లందరి నుంచి అర్ధరూపాయి వసూలుచేసి బదులుగా బతుకుమీద ఆశ పంచుతున్నాడతను.

చివరికి ఆ అమ్మాయి మళ్లీ వస్తానని లేచి వెళ్లిపోయింది. మళ్లీ వస్తుంది గదా అని కొంతమంది వాడిచేత జ్యోతిష్యం చెప్పించుకుంటున్నారు. వాడు చెప్పింది అక్షరాలా జరుగుతుందని కొందరంటున్నారు. వాడి చిలక దేవతాచిలకంటున్నారు. నాకు బస్సొచ్చింది వెళ్లిపోయాను.

### చిలక జోస్యం

మళ్లీ వారం రోజులకు అదే దృశ్యం— ఆ అమ్మాయే! అక్కడే చెయ్యి చూపించుకుంటోంది. జనం మూగారు. ఆ అమ్మాయి లేచింది. తీరా చూస్తే మా వీధి చివర చిన్న పెంకుటింట్లో వున్న రిటైర్డ్ క్లర్కు వెంకట్రామయ్యగారమ్మాయే. వెళుతున్న అమ్మాయిని పేరుపెట్టి పిలిచి ఆపి "ఏమిటమ్మా నీకే పిచ్చి? ఎందుకు వాడికి అలా డబ్బు తగలేస్తావు? జోస్యం మీద అంత నమ్మకమా?" అని అడిగాను.

"ఏం చెయ్యను సార్! నాన్న రిటైరయ్యారు. పెద్ద సంసారం. బియ్యే పాసయ్యాను. ఫార్వర్డ్ కాస్ట్. ఉద్యోగం లేదు. ట్యూషన్లు చెబుతున్నాను. చాలదు. పాపం అతనూ రోజూ ఒక అరగంట అక్కడ కూచోమంటాడు. జనం మూగుతారు. నేను లేచిపోతాను. అతని వ్యాపారం బావుంది. సాయంత్రం తండ్రిలాగా వచ్చి 5 రూపాయిలిచ్చిపోతాడు. మా తమ్ముడికి, చెల్లెలికి స్కూలు ఖర్చులకొస్తాయి" అని చెప్పింది.

'స్వతంత్రం వచ్చి నలభై యేళ్లయింది' అని కన్నీళ్లతో అనుకున్నాను.

**—చెరువు ఆంజనేయశాస్త్రి**